# దైవప్రేమలో జీవించండి, లౌకిక ప్రేమలో కాదు

**ప్రేమస్వరూపులారా!**

ప్రపంచములో మనము ఎన్నియో చూస్తున్నాము, ఎన్నియో అనుభవిస్తున్నాము. అయితే, మానవుని అంతటి గొప్పవాడు, ప్రజ్ఞావంతుడు, విజ్ఞుడు ఎక్కడా కనిపించడం లేదు. కనుకనే, 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ప్రతి వస్తువునందుకూడను పంచ భూతములున్నవి. పశు, పక్షి, మృగాదులయందు, వృక్షములయందు, క్రిమి కీటకాదులయందుకూడను ఈ పంచభూతములు ఉన్నవి. ఇవే పంచభూతములు మానవునియందుకూడను ఉన్నవి. కాని, మానవుడు వాటిని సద్వినియోగపరచుకోవడం లేదు.

ఈనాటి మానవుడు 'నాలెడ్జి'ని సముద్రమంత విశాలంగా అభివృద్ధి చేసుకుంటున్నాడు. 'కామన్ సెన్స్'ను హిమాలయ పర్వతములవలె పెంచు కుంటున్నాడు. ఇంత 'నాలెడ్జి', 'కామన్ సెన్స్' ఉండినప్పటికినీ ఈనాటి మానవునిలో విచక్షణా శక్తి జీరో! 'ఇది మంచిదా? చెడ్డదా? ఇది చేయదగినదా? చేయదగనిదా?' అనే విచక్షణ శూన్యమైపోతున్నది. అందువల్లనే, మానవత్వము ఈనాడు పూర్తి క్షీణించి పోతున్నది. మానవతా విలువలు విచక్షణా జ్ఞానంలోనే ఇమిడి ఉంటున్నవి. అది లేనప్పుడు ఎన్ని ఉండి ప్రయోజనమేమిటి?! ఈనాడు ఎక్కడికి వెళ్ళినను ప్రతి దానికికూడను డబ్బు, డబ్బు, డబ్బు! మానవుడు డబ్బును అమితంగా పెంచుకుంటున్నాడు. కాని, విచక్షణా జ్ఞానమును ఉపయోగించి, ఆ డబ్బు తనకు అవసరమా? కాదా? అనే విషయాన్ని ఏమాత్రము విచారించటం లేదు.

**దైవాన్ని వెతుకనక్కర్లేదు, నీవే దైవం**

(భగవాన్ తమ కర్చీఫ్‌ను చూపుతూ) ఇది ఏమిటి? ఒక వస్త్రము. ఇది వస్త్రము

sri sathyasai vachanamrutam

ఎట్లయింది? దారములయొక్క చేరికవల్లనే అయింది. ఈ దారములు ఎక్కడినుండి వచ్చాయి? ప్రత్తినుండి వచ్చాయి. మొదటిది ప్రత్తి, రెండవది దారము, మూడవది వస్త్రము. ఈ మూడూ చేరి ఒక్కటే! అదేవిధంగా, You are not one person, but three - the one you think you are, the one others think you are, the one you really are (నీవు ఒక్క వ్యక్తివి కావు; నీలో ముగ్గురున్నారు – 1. నీవనుకొనే నీవు 2. ఇతరులు అనుకొనే నీవు 3. అసలైన నీవు) కనుకనే కృష్ణుడు చెప్పాడు, 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. అంటే అందరుకూడను దైవముయొక్క అంశములే! మీరందరూ దైవాన్ని వెతుకుతూ ఉన్నారు. కాని, వెతుకనక్కర్లేదు. నీవే దైవం. 'ఇంటియందు దీపము వెలుగుచునుండగా పరుల ఇంటికి అగ్గికై అరుగనేల?' అదేవిధముగనే, నీవే భగవంతుడవై యుండగా తిరిగి భగవంతునికోసం వెతకడమెందుకు?!

కేవలం దేహాభిమానముచేత, ఇంద్రియాభిమానముచేత మానవుడు 'నేను, నాది' అనే భ్రాంతిలో మునిగిపోతున్నాడు. దేహాభిమానంవల్ల attachment ఏర్పడుతున్నది. ఈ దేహం ఎంతవరకు? ప్రాణమున్నంతవరకే నీవు దేహాన్ని ఆశిస్తున్నావు. ప్రాణం పోతూనే దానిని నిర్దాక్షిణ్యంగా నిప్పులో వేస్తావు. అప్పుడు ఆ దేహం ఎవరిది? "ఇది నా దేహము", "నా మైండు", "నా బుద్ధి", "నా చేయి", "నా కాలు" ..... అంతా 'నాది, నాది, నాది' అంటున్నావు. 'నా దేహము' అన్నప్పుడు దేహము వేరు, నీవు వేరు. మరి నీవెవరు? దేహము నీవు కాదు, ఇంద్రియములు నీవు కాదు, బుద్ధి నీవు కాదు. నీవు నీవే. అదే 'I' (నేను). అది ఒక్కటే. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. ఆ 'అహం' (I)కు ఆకారాన్ని చేర్చినప్పుడు, అదే అహంకారం. ఆ 'I' తలకొట్టేస్తే అది 'క్రాస్' అవుతుంది. దానినే క్రిస్టియన్లు పూజిస్తున్నారు. అనగా, అహంకారమును త్రుంచివేస్తే నీవు నీవవుతావు. నీవు మానవుడవు కావు. నీవే దైవం. కాబట్టి, దైవాన్ని వెతుకవలసిన అవసరమే లేదు. భగవంతుడు ఎక్కడ చూసినా ఉన్నాడు. ఈ వస్త్రము దైవమే! ఈ పుష్పము దైవమే. ఈ టేబుల్ దైవమే. Everything is God (సర్వమూ దైవమే) కేవలము అజ్ఞానముచేతనే 'నేను, నీవు' అనే భేదములు ఏర్పడుతూ వచ్చినవి. ఎప్పటికీ నేను వేరు, నీవు వేరు కాదు. నేను సత్యసాయిబాబాను కాదు. నేను నేనే! సత్యసాయిబాబా అనేది కేవలము ఈ దేహానికి

sri sathyasai vachanamrutam

పెట్టినటువంటి పేరు. కాని, నాకు ఎట్టి పేరూ లేదు.

**నీవు చేయవలసిన సాధన**

అన్ని దేహములలోనూ పంచభూతములు, పంచ ప్రాణములు, పంచేంద్రియములు ... ఇవన్నీ ఉన్నాయి. కాబట్టి, అందరూ సమానమే! నీవు ప్రత్యేకమైనటువంటివాడవు కావు. కాని, ఆధ్యాత్మిక తత్త్వము తెలియ నటువంటివారు అనేక భ్రమలలో మునిగి అజ్ఞానంతో అవస్థపడుతున్నారు. 'నాలోనే ఉన్నాడు భగవంతుడు' అన్న నమ్మకం పెట్టుకో. ఆ నమ్మకం ఉన్నప్పుడే నీ నిజమైన రూపం నీకు కనిపిస్తుంది. భగవంతునిపైన విశ్వాసము ఉన్నటువంటివానికి ప్రేమ పుడుతుంది. ప్రేమ ఉన్నటువంటివానికి శాంతి ఏర్పడుతుంది. శాంతి ఏర్పడినప్పుడు సత్యము ఆవిర్భవిస్తుంది. ఈ సత్యమే దైవం. సత్యమనేది ఎవరో పుట్టించినటువంటిది కాదు. సత్యమునకొక రూపము లేదు. సత్యము సత్యమే. శాంతి శాంతియే. దానికీ రూపము లేదు. అట్లే, ప్రేమ ప్రేమయే. ప్రేమను ఎవరూ పుట్టించలేదు. ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. మానవతా విలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు రూపరహితమైనటువంటివి. ఇవి మన హృదయంలోనే హత్తుకొని ఉన్నాయి. ఈనాడు మనము చదివే చదువులు, వ్రాసే వ్రాతలు .... ఇవన్నీ భౌతికమైన, లౌకికమైన చదువులేకాని నిజమైన చదువులు కావు. నిజమైనటువంటి చదువు – 'ఎడ్యుకేర్'. లోపల ఉన్నటువంటిదానిని బయటికి తీయటమే – 'ఎడ్యుకేర్'. సత్యము, శాంతి, త్యాగము ఇత్యాది మానవతా విలువలు మన హృదయంలో ఉన్నాయి. కాని, అవి నీకు కనిపించడం లేదు. వాటిని వెతికి బయటికి తీయాలి. అదే నీవు చేయవలసిన సాధన.

మీరు మెడిటేషన్ చేస్తారు, జపం చేస్తారు. కాని, ఈ జపమువలన మీకు ఏమి తెలుస్తున్నది? కేవలం మాల త్రిప్పటం మాత్రమే తెలుస్తున్నది. ఇది కాదు సాధన. ఇవన్నీ మనము కల్పించుకొన్నటువంటి కృత్రిమ సాధనలేకాని సత్యమైనవి కావు. ఈనాటి సైన్సుకూడను అటువంటిదే! ఈ సైన్సు 'సెన్సెస్' (ఇంద్రియాల) నుండి వచ్చినటువంటిదే! 'సెన్సెస్' లేకపోతే 'సైన్సే' లేదు. దైవం ప్రత్యేకంగా లేదు. దైవము మీయొక్క సత్యమునుండియే మీకు సాక్షాత్కరిస్తాడు. కనుక, మీరు అనవసరమైన సాధనలు చేసి

srisathyasaivachanamrutam

కాలమును వ్యర్థం చేసుకోకండి. కాలమును వ్యర్థం చేసినప్పుడు జీవితమే వ్యర్థమైపోతుంది. సత్యమునే మన లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు మనకు ఏదీ అడ్డు ఉండదు.

**దైవాన్ని ప్రేమించండి, అదే నిజమైన ప్రేమ**

ఈ చిన్న వయస్సులో మీ ఇంద్రియాలు చాలా బలంగా ఉన్నాయి; మనోబుద్ధులు చూస్తే చాలా చురుగ్గా ఉన్నాయి. ఇంత శక్తి ఉండికూడను మీరు ఎందుకింత బలహీనులవుతున్నారు? దీనికి కారణం – మీరు కృత్రిమమైన జీవితాన్ని గడుపుతున్నారు. మీ అందరిలోనూ ప్రేమ ఉన్నది. ప్రేమ కేవలం మీ సొత్తు కాదు. అది అందరి సొత్తు. నాలో, నీలో, అందరిలోనూ ప్రేమ ఉంది. కాని, ఈ ప్రేమకు అనేక పేర్లు పెట్టి అనుభవించుకోవడానికి మీరు ప్రయత్నిస్తున్నారు. ఎవరిని ప్రేమించినప్పటికీ కేవలం 'ఆర్టిఫిషియల్'గా ప్రేమిస్తున్నారు. మీరు మరోవిధంగా భావించకూడదు గాని ఇప్పుడు మగపిల్లలుగాని, ఆడపిల్లలుగాని కేవలము అల్పతృప్తి నిమిత్తమై ఒకరినొకరు ప్రేమిస్తున్నారు. అది కృత్రిమమైన ప్రేమ; కొంత కాలము ఉంటుంది, తరువాత పోతుంది; అంతేకాదు, మానవుణ్ణి బలహీనుని గావిస్తుంది. ఈ బలహీనతవల్ల అనేక రోగములు ప్రారంభమవుతాయి. ఈ ప్రేమతత్త్వ మనేది ముఖ్యంగా యువతీ యువకులకు చెప్పవలసినటువంటి విషయము. ప్రేమతత్త్వము కేవలము దైవత్వమే తప్ప అన్యము కాదు. దేవునినుంచి వచ్చినటువంటి ప్రేమతత్త్వమునే మనం అందుకోవాలి. ఇతరులనుండి వచ్చినటువంటిదానిని తీసుకోకూడదు. దైవాన్ని ప్రేమించండి. అదే నిజమైన ప్రేమ. అదిగాక మీరు దేనిని ప్రేమించినప్పటికీ అది సత్యము కాదు.

ప్రేమస్వరూపులారా! మీరు ఎన్నియో సాధనలు చేస్తున్నారు. ఎన్ని చేసినప్పటికీ మీకు సత్యము చిక్కడం లేదు. ఎంతమందిని ఆశ్రయించినా, ఎంతమందిని చేర్చుకున్నా మీకు లభించవలసిన ప్రేమ లభించడం లేదు. నిజమైన ప్రేమ దైవమునుంచే ఆవిర్భవిస్తుంది. దైవము ప్రేమస్వరూపుడు. మీరు ఆ దైవప్రేమలో నిలవాలిగాని, లౌకిక ప్రేమలో కాదు. ఇప్పటికే కాలాతీతమై పోయింది. మీకు శ్రమ కలిగిస్తున్నాను. ఇక ఇంతటితో నా ప్రసంగాన్ని విరమించి ఈ ప్రేమ తత్త్వాన్నిగురించి ముున్ముందు మీకు చక్కగా వివరించి

srisathyasaivachanamrutam

చెపుతాను. భగవంతుడు మీకు సులభంగా చిక్కుతాడు. ఈ ప్రపంచములో ఏమాత్రం టైమ్ తీసుకోకుండా, ఏమాత్రం శ్రమ లేకుండా లభించేది దైవము ఒక్కడే. దైవప్రేమను మించినది ప్రపంచములో మరొకటి లేదు. ప్రేమ అనే పదము చాలా చిన్నదిగా కనిపిస్తుంది కాని, ఇది చిన్నది కాదు; పర్వతమువంటిది, సముద్రము వంటిది. ఇది ఏమాత్రం వెలితి కాదు, తరిగిపోదు. అటువంటి ప్రేమతత్త్వాన్ని మీరు గుర్తించుకోవాలి. ప్రేమతత్త్వాన్ని చెప్పాలంటే ఎవ్వరికీ సాధ్యము కాదు. ఎందుకంటే, ఒక్కొక్కరి స్థితిగతులు, అనుభవాలు ఒక్కొక్కరీతిగా ఉంటాయి. కనుక, ఎవరూ చెప్పలేరు. నేను దీనిని చక్కగా వివరించి చెపుతాను.

**(ప్రపంచ యువజన సమ్మేళనం, తేదీ 26.7.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam